# షో

రాష్ట్ర ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చింది. తాము చేసే అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా జరగటానికి, ఏవైనా లోపాలు వుంటే చూపించి, సత్వర అభివృద్ధి సాధించడం కోసమని ఒక కమిటీ వేశారు.

ఆ కమిటీకి సత్యారావుని అధిపతిగా నియమించారు. అంటే ఏకసభ్య కమిటీ అన్న మాట. ఆయనకింద ఒక పదిమంది ఉద్యోగులు పరివారం, కార్యాలయం వగైరాలు. సత్యారావుగారు పదవీ స్వీకారం చేశారు. ఆ రోజునే అభివృద్ధి కార్యక్రమాలు తనిఖీకి బయలుదేరారు. ఆయన అవిశ్రాంతంగా ఒక పదిహేను రోజులు అభివృద్ధి కార్యక్రమాలు తనిఖీచేసి ఒక నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. ఆ నివేదిక సారాంశం.

వంకాయలపాడు ఏటికి వంతెన కడుతున్నారు. ఆ వంతెన కట్టడానికి వాడే సిమెంటు కల్తీది. ఆ సిమెంటు సప్లయిదారును వెంటనే అదుపులోకి తీసుకోవాలి.

గోంగూర పాలెంలో ఇంతవరకు తారు రోడ్డులేని చోట తారురోడ్డు వేయిస్తున్నారు. అక్కడ రోడ్డు నిర్మాణం పరిశీలించగా అక్కడ తారు వాడుతున్న దాఖలా లేదు. పైగా ఎఱ్ఱమట్టి కంకర కలిపి పోసి రోడ్ రోలర్ దొర్లిస్తున్నారు. ఈ కంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి.

బెండపట్నంలో నిర్మిస్తున్న స్కూల్ భవనం నిర్మాణం విషయంలో అక్కడ సిమెంటు ఇటుకలతో నిర్మిస్తున్నట్లు అంచనాలువున్నాయి అయితే రాళ్ళు, మట్టితో నిర్మాణం జరుగుతోంది వెంటనే ఈ సంగతి పరిశీలించాలి.

రైతులకు అప్పులిస్తున్నారని పరిశీలించడానికి ఒక చోటకు వెళ్తే అక్కడ ప్రతి రైతుకు ఇచ్చే సుమారు రెండువేల రూపాయలలో, మధ్య దళారీలకు, చోటా రాజకీయ నాయకులకు రైతులు ఇచ్చే కానుకలు పోను వాళ్ళకు రెండువందలు ముడుతోంది. ఇదివెంటనే పరిశీలించాలి.

సత్యారావుకు మంత్రివర్గం నుంచి కబురు వచ్చింది.

"ఏమయ్యా సత్యారావూ ఏదో మనపార్టీలో పెరిగావని అభిమానంతో కమిటీ వేశాము. రిపోర్టు ఇలాఇస్తే మన ప్రభుత్వం గతి ఏంకాను?" అన్నాడు

"అయ్యా నేను వ్రాసినవన్నీ సత్యాలు. తమరు వెళ్ళి పరిశీలించాలి. ఆ తరవాత నన్ను శిక్షించండి నేను వ్రాసినవి తప్పు అయితే" వినయంగా అన్నాడు సత్యారావు.

"భలేవాడే వయ్యా అవన్నీమాకు తెలియదనుకుంటున్నావా? అన్నీ తెలుసు. కాని కమిటీ అని ఒకటివుండాలి, నువ్వేం చేయాలంటే అన్నీ సక్రమంగా వున్నాయని నివేదిక ఇవ్వాలి. ఇదంతా ఒక షో. అప్పుడు ప్రజలు మనల్ని నమ్ముతారు. నువ్వు అన్నీ బాహాటంగా వ్రాస్తే ఎలాగయ్యా—" అన్నారు.

"ఇదిగో తీసుకోండి" అని ఒక కాగితం ఇచ్చాడు సత్యారావు.

అది సత్యారావు రాజీనామా.

మరో నమ్మకస్థుణ్ణి విశ్వాస పాత్రుణ్ణి కమిటీకి వేసి, పునర్వ్యవస్థీకరించారు ఆ కమిటీని.

—o—